క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె రూరల్: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో శనివారం పట్టణ, మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఆ శాఖ పట్టణ ఏడీఈ సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో రాజేష్ థియేటర్, ఏకలవ్య సెంటర్, బీహెచ్, పోలీసు క్వార్టర్స్, డొంక రోడ్డు, ఒలివల కొండ చర్చి, ఏకలవ్య సెంటర్లలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. మండలంలోని మోర్లవారిపాలెం, అరవపల్లి, పోటుమెరక, గంగడిపాలెం, రాజుకాల్వ, లంకెవానిదిబ్బ, బొబ్బర్లంక, చోడాయపాలెం, పిరాట్లంక గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

నిజాంపట్నం: కొత్తపాలెం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు యువశక్తి అసోసియేషన్ సభ్యులు స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా శుక్రవారం పంపిణీ చేశారు. యూటీఎఫ్ రూపొందించిన స్టడీమెటీరియల్ విద్యార్థులకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. 10వ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యువశక్తి అసోసియేషన్ సభ్యులు గుర్రం మురళీ, మౌలాలి, నాగబాబు, రామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ క్యాంప్

చెరుకుపల్లి: పుట్టిన బిడ్డ నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు ఆధార్ నమోదుపై శనివారం నుంచి నుంచి సర్వే నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షేక్ మహబూబ్ సుభాని తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆధార్‌కార్డు తీసుకోవాలని తెలిపారు. దీనిపై మహిళా పోలీసులతో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సర్వే నిర్వహిస్తామన్నారు. ఒక వేళ ఆధార్ కార్డు పొందకపోతే మరోమారు ప్రత్యేక ఆధార్ శిబిరం ఏర్పాటు చేసి, ఆధార్ కార్డు పొందే విధంగా చూస్తామన్నారు.

నేడు అప్రెంటీస్ మేళా

నిజాంపట్నం: ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రధానమంత్రి జాతీయ అప్రెంటీస్ షిప్ మేళాను స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 10న, సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎన్.సుదాకర్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేళాలో తడకు చెందిన డెకన్ శ్రీసిటీ, మంగళగిరిలోని ఎస్ఆర్ఎం, చందోలులోని ఎన్ఎస్ఎల్ కంపెనీలతో పాటు పలు కంపెనీల ప్రతినిధులు హాజరవుతాయని చెప్పారు. మేళాలో ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులను అప్రెంటీస్ శిక్షణకు ఎంపిక చేస్తారని చెప్పారు. ఎంపికైన అబ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు శిక్షణభృతి చెల్లించబడుతుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



నిజాంపట్నం: కొమరవోలు గ్రామంలో ఇటీవల అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు నిజాంపట్నం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయుల సహకారంతో శుక్రవారం చేయూతనిచ్చారు. విరాళాలు సేకరించి నష్టపోయిన 10వ తరగతి విద్యార్థిని గుమ్మడి నాగమణి కుటుంబానికి రూ.5,106లు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సేవా నిరతిని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శివన్నారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు. అగ్నిప్రమాద బాధిత మూడు కుటుంబాలకు రెడ్‌క్రాస్ సొసైటీ చేయూతనిచ్చింది. బాధితులు గుమ్మడి పరిశుద్ధరావు, గుమ్మడి ధనలక్ష్మి, గుమ్మడి రాజేంద్రప్రసాద్‌లకు నిత్యావసర వస్తువులు, కూరగాయలు, దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ నిజాంపట్నం చైర్మన్ కె.గౌరీశంకర్, జాయింట్ సెక్రటరీ డి.బసవరాజు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతి మండలంలో ఉచిత వైద్య శిబిరాలు



బాపట్ల: ఉచిత వైద్య శిబిరాలు ప్రతి మండల కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని హిందూ చైతన్య వేదిక సంయోజక్ బెజవాడ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మండలంలో కమిటీలు ఏర్పాటు చేయడంతో పాటు ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించాలని తీర్మానం చేశారు. హిందూ చైతన్య వేదిక చేపడుతున్న కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లో తీసుకుపోవాలని కోరారు. వక్కలగడ్డ ప్రసాద్, సాయిన కొండలు, కేసని శివ గుడారంకమ్మ, నిజాంపట్నం సత్యనారాయణ, అంగలకుదురు నటరాజన్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఆక్సిజన్ ప్లాంట్

- అలంకార ప్రాయంగా మారిన వైనం
- మరమ్మతులకు నోచుకోక నిరుపయోగం
- పట్టించుకోని పాలకులు, అధికారులు



ప్రభుత్వ వైద్యశాలలోని ఆక్సిజన్ ప్లాంట్

రేపల్లె రూరల్: తీరంలో నెలకొల్పిన ఆక్సిజన్ ప్లాంట్ రోగుల పాలిట వరంగా ఉండేది. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో ఎంతో మందికి ప్రాణవాయువును అందించిన ఆక్సిజన్ జనరేషన్ ప్లాంట్ నిరాదరణకు గురవుతోంది. దీంతో దాతల సాయం నీరుగారిపోతోంది. గత కొన్ని నెలల క్రితం మరమ్మతులకు ఈ ప్లాంటును పాలకులు, అధికారులు నిర్లక్ష్యం చేశారు. దీంతో నిరుపయోగంగా మారింది. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 2022 జనవరి 21న రేపల్లె రెడ్‌క్రాస్ సొసైటీ, హిందుస్థాన్ కోకో కోలా బేవరేజస్ సంస్థ సహకారంతో ఆక్సిజన్ జనరేషన్ ప్లాంట్‌ను నెలకొల్పారు. నాటి నుంచి ప్రాణ వాయువును అందిస్తున్న ఈ ప్లాంట్ కొన్ని నెలల క్రితం మరమ్మతులకు గురైంది. దీంతో రోగులకు సకాలంలో ప్రాణ వాయువు అందక ఇబ్బందులు పడుతున్నారు.

కోవిడ్ సమయంలో..

కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణవాయువు సకాలంలో అందక ఎందరో మృత్యువుతో పోరాడారు. తీరంలో సైతం కోవిడ్ భారినపడి పట్టణంలో సరైన వైద్య సేవలు లేక తెనాలి, గుంటూరులలోని క్వారంటైన్‌కు పంపించారు. అయితే తీరంలోనూ ఆక్సిజన్ అందిస్తే ఇక్కడే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించి కాపాడే ఉద్దేశంతో ఏర్పాటు చేయబడిన ఆక్సిజన్ ప్లాంట్ పలువురికి ప్రాణవాయును అందించి ప్రాణదాతగా నిలిచింది. నేటికి ఆయాసం, ఉబ్బసం వంటి వ్యాధులతో బాధపడే వారికే కాకుండా ఆపత్కాలంలో వైద్యశాలకు వచ్చే వారికి ఆక్సిజన్ అందిస్తూ ప్రాణాలను నిలుపుతోంది. కోవిడ్ సమయంలో రేపల్లెలో ఏర్పాటు చేసిన క్వారంటైన్‌లో చికిత్సలు పొందిన పలువురికి ఆక్సిజన్‌ను అందించింది.

కూటమి నేతల నిర్లక్ష్యం..

ప్రాణవాయువు అందక ఎవరూ ఇబ్బందులు పడకూడదన్న లక్ష్యంతో రేపల్లె తీరప్రాంతంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రాణ వాయువు ప్లాంట్ మరమ్మతుల నిర్వహణలో కూటమి నేతలు నిర్లక్ష్యం వహిస్తున్నారు. అధికారులు కూడా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం శీతాకాలంలో ఆయాసం, ఉబ్బసంతో బాధపడే ప్రాణవాయువు అవసరం ఎంతో ఉంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి జనరేషన్ ప్లాంట్‌కు మరమ్మతులు నిర్వహించి వినియోగంలోకి తీసుకురావాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

> **ఉన్నతాధికారులకు తెలియజేశాం**
>
> వైద్యశాలలోని ఆక్సిజన్ జనరేషన్ ప్లాంట్ మరమ్మతులకు గురైనా అంశాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం. ప్రస్తుతం వైద్యశాలలో చికిత్స పొందుతున్న రోగులకు అవసరమైన ఆక్సిజన్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే ప్లాంట్‌కు మరమ్మతులు నిర్వహించి, వినియోగంలోకి తీసుకువస్తాం.
>
> – సుధాకర్, సూపరింటెండెంట్, ప్రభుత్వ వైద్యశాల

హైకోర్టు ఆదేశాలతో మళ్లీ సర్పంచ్‌గా మల్లెల బాధ్యతలు


సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన మల్లెల వెంకటేశ్వర్లు

కర్లపాలెం: మండలంలోని పేరలి గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా మల్లెల వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. 2021 ఫిబ్రవరి 9న పేరలి గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో మల్లెల వెంకటేశ్వర్లు గెలుపొందారు. అతనికి 12 వార్డులో ఓటు లేదని, ఆధార్, రేషన్ కార్డుల్లో మల్లెల వెంకటేశ్వర్లు అని పేరుందని, ఓటరు జాబితాలో మల్లెల ఆదాము అని ఉందని, తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో నామినేషన్ వేసి గెలుపొందాడని, ఎన్నికను రద్దు చేయాలని ప్రత్యర్థి గొర్రుముచ్చు వీరయ్య జిల్లా కోర్టును ఆశ్రయించాడు. ఈ మేరకు విచారణ జరిపిన జిల్లా ప్రధాన యమూర్తి సర్పంచ్‌గా మల్లెల వెంకటేశ్వర్లు ఎన్నిక చెల్లదని, రెండవ స్థానంలో అత్యధిక ఓట్లు సాధించిన గొర్రుముచ్చు వీరయ్యను సర్పంచ్‌గా నియమించాలని తీర్పు ఇచ్చింది. దీంతో డీఎల్‌పీవో శరత్‌బాబు, ఎంపీడీవో శ్రీనివాసరావు 2025 జనవరి 3న వీరయ్యతో సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేయించారు. దీంతో వెంకటేశ్వర్లు హైకోర్టును ఆశ్రయించారు. జిల్లా కోర్టు తీర్పుపై స్టే ఇవ్వడంతో పాటు తీర్పు వెలువడే వరకు మల్లెల వెంకటేశ్వర్లునే సర్పంచ్‌గా కొనసాగించాలని పేర్కొంది. దీంతో గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు సర్పంచ్‌గా వెంకటేశ్వర్లుకు బాధ్యతలు అప్పగించారు. తనకు అండగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతికి ధన్యవాదాలు తెలిపారు.

వైభవంగా అమరలింగేశ్వరస్వామి ప్రతిష్ఠోత్సవం


అమరలింగేశ్వరస్వామి

రేపల్లె రూరల్: మండలంలోని కారుమూరు గ్రామంలో పునఃనిర్మించిన పరబ్రహ్మేశ్వరి సమేత అమర లింగేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠా మహాకుంభాభిషేక మహోత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. వేద పండితులు నందివెలుగు బాలాజీ గురుకులు ఆధ్వర్యంలో అమరలింగేశ్వరస్వామి, లలితా పరబ్రహ్మేశ్వరిల విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం నిర్వహించారు. గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, అయ్యప్ప, భద్రకాళి సమేత వీరభద్రుడు, కాలభైరవస్వామి, ఆంజనేయస్వామి, యుగళ నాగేంద్రస్వామి, నంది, నవగ్రహాలు, ఆలయ శిఖరం, ధ్వజ స్తంభాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోమాది పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. అభివృద్ధి కమిటీ చైర్మన్ యెడం వెంట సునీల్, వైస్‌ప్రెసిడెంట్ మల్లికార్జునరావు, నిర్వాహకులు గుడి ఆమణికంఠం, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

> ప్రముఖ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ బైరపనేని విజయబాబు


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

గుంటూరు మెడికల్: స్మార్ట్ ఫోన్‌ల వాడకం పెరిగిపోవడంతో చిన్నారుల్లో కూడా కంటి సమస్యలు బాగా పెరిగిపోతున్నాయని ప్రముఖ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ బైరపనేని విజయబాబు అన్నారు. కంటి సమస్యలను నిర్లక్ష్యం చేస్తే చూపు పోయే ప్రమాదం ఉందని, ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స చేయించాలన్నారు. లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం పిట్టలవాని పాలెం మండలం అల్లూరు గ్రామంలో కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, ఈసీజీ, ఎకో వైద్య పరీక్షలు ఉచితంగా చేసి మందులు పంపిణీ చేశారు. కార్డియాలజీ, ఆప్తమాలజీ, యూరాలజీ, ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ శర్వణ్‌కుమార్, డాక్టర్ సాయికుమార్, డాక్టర్ వివేక్ రోగులను పరీక్షించి వైద్య సలహాలు అందజేశారు. 1,200 మందికి పైగా గ్రామస్తులు వైద్య పరీక్షలు చేయించుకున్నారని హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.వి.రాఘవశర్మ తెలిపారు. అల్లూరు గ్రామ మాజీ ప్రెసిడెంట్ కొమ్మూరు కాశయ్య, లక్ష్మీనరసింహస్వామి దేవాలయ చైర్మన్ రవివర్మ, ఎం.విజయరాజు, బి.రవి, హాస్పటల్ పీఆర్వో రాజా రమేష్, నర్సింగ్ సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

యడ్లపల్లి గ్రంథాలయంలో వార్షిక తనిఖీ



చుండూరు(వేమూరు): గ్రంథాలయాలను ప్రజలకు ఉపయోగపడే విధంగా వినియోగించాలని గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ వి.సుబ్బరత్నమ్మ అన్నారు. చుండూరు మండలంలోని యడ్లపల్లి శాఖా గ్రంథాలయం వార్షిక తనిఖీ శుక్రవారం నిర్వహించారు. స్థానికులు గ్రంథాలయంలో సౌకర్యాల కొరతను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. శ్లాబు పెచ్చులు ఉండి పడోతుందని చెప్పారు. గ్రంథాలయ కార్యదర్శి పాల్గొన్నారు.

మహిళల గొడవ..కేసు నమోదు

కొల్లూరు(వేమూరు): మరుగు దారిపై ఇద్దరు మహిళలు గొడవ పెట్టుకుని, దాడి చేయడంతో పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. కొల్లూరు మండలంలోని జువ్వలపాలేనికి చెందిన కొండ సీన వెంకటేశ్వరమ్మ, ఇంటి ఎదురుగా ఉండే భూపతి సుశీల మురుగు పారే దారిపై గొడవ శుక్రవారం పెట్టుకున్నారు. వెంకటేశ్వరమ్మ దుర్భాషలాడి, ఇష్టం వచ్చినట్లు కొట్టిందని సుశీల తెనాలి ప్రభుత్వం వైద్యశాలలో చికిత్స తీసుకుంది. వైద్యశాల అవుట్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యూకేజీ గ్రాడ్యుయేషన్ డే


సర్టిఫికెట్స్ చూపుతున్న చిన్నారులు

రేపల్లె రూరల్: పట్టణంలోని మోంట్ ఫోర్ట్ స్కూలులో శుక్రవారం యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. యూకేజీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ సర్టిఫికెట్స్ అందజేశారు. నర్సరీ, యూకేజీ, ఎల్‌కేజీలో రాణించిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రిన్సిపల్ బ్రదర్ కిరణ్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ బ్రదర్ ప్రదీప్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫ్రైడే - డ్రైడేపై అవగాహన ప్రదర్శన



బాపట్ల: ప్రతి ఫ్రైడే డ్రైడే కార్యక్రమం కొనసాగిస్తామని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. పట్టణంలోని అక్బర్ పేటలో డ్రైడే కార్యక్రమం చేపట్టారు. చెత్తాచెదారం తొలగించి, ఫాగింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా అవగాహన ప్రదర్శన చేపట్టారు. కమిషనర్ మాట్లాడుతూ పురప్రజలు ప్రతి శుక్రవారం మున్సిపల్ అధికారులు చేపట్టే కార్యక్రమంలో పాల్గొని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. వాడిపారేసిన కొబ్బరి బోండాలు, ఉపయోగంలో లేని కూలర్లు, నిలిచి ఉన్ననీరు, టైర్లు, తొట్లలో, కుండీల్లో ఉన్న నీటిని తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ ప్రభాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కరుణ, శ్రీనివాసరావు ఉన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన అవసరం

తెనాలిఅర్బన్: క్షయ వ్యాధిపై అవగాహన అవసరమని జిల్లా వైద్యశాలలోని పీపీ యూనిట్ వైద్యురాలు డాక్టర్ రమాదేవి సూచించారు. టీబీ యూనిట్ ఆధ్వర్యంలో ఐతానగర్‌లోని ఎన్ఎస్ఎస్‌హెచ్ స్కూల్‌లో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధి అంటువ్యాధి అని, ఒకరి నుంచి మరొకరికి త్వరగా వ్యాప్తి చెందుతుందని తెలిపారు. చిన్న పిల్లలకు ఎక్కువగా సోకే అవకాశం ఉందన్నారు. క్షయ వ్యాధి సోకిన వారు కుటుంబ సభ్యులకు దూరంగా ఉండాలని సూచించారు. 18ఏళ్లలోపు పిల్లలకు ఎక్కువగా వ్యాధి లక్షణాలు కనిపిస్తున్నాయని చెప్పారు. టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పల్లెకొండ రవికుమార్ మాట్లాడుతూ ప్రపంచ క్షయ దినోత్సవాన్ని పురస్కరించుకుని అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో హెచ్ఎం రాజ్యలక్ష్మి, ఆర్ట్ మాస్టర్ టి.వెంకట్, ఏఎన్ఎంలు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గోగులమ్మకు పూజలు



భట్టిప్రోలు(వేమూరు): భట్టిప్రోలు మండలంలోని పెదపులివర్రు గ్రామంలో శుక్రవారం గ్రామ దేవత గోగులమ్మకు పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, మొక్కుబడులు చెల్లించుకున్నారు. తదుపరి దివ్య ఆనంద దర్శనం చేశారు.

సైకిల్ షెడ్డు ప్రారంభం



భట్టిప్రోలు(వేమూరు): పాఠశాలల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారం పూర్తిగా ఉండాలని ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి అన్నారు. భట్టిప్రోలు మండలంలోని పల్లికోన జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైకిల్ షెడ్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల పూర్వ విద్యార్థులు రూ.2.60లక్షలతో షెడ్ నిర్మించినట్లు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యులు తిరువీధుల ఉదయ భాస్కరి, పాఠశాల హెచ్ఎం ఈగ మునియ్య పాల్గొన్నారు.

గుండె భరోసాపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న మెడికల్ అధికారి సయ్యద్ జెరీనా పరివిన్

వేమూరు: గుండె నొప్పికి గోల్డెన్ అవర్ చికిత్స అందిస్తున్నట్లు సామాజిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆధికారి డాక్టర్ సయ్యద్ జెరీనా పరివిన్ తెలిపారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలోని సిబ్బందికి గోల్డెన్ అవర్ చికిత్సపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గుండెపోటు వస్తే కొన్ని లక్షణాలు కనిపిస్తాయన్నారు. గుండె దడ, ఎడమ భుజం లాగడం, ఛాతి నొప్పి, కళ్లు తిరగడం, స్పృహ కోల్పోవడం ఎక్కువగా చెమట పట్టడం అందులో భాగమన్నారు. అశ్రద్ధ చేయకుండా వెంటనే దగ్గరలోని ఆసుపత్రికి తీసుకెళ్లాలని చెప్పారు. వైద్యుల పరీక్షించి ఈసీజీ రిపోర్టును ప్రభుత్వ యాప్‌లో ఉంచితే.. వైద్య నిపుణుల సూచనల మేరకు వైద్య అందించడం జరుగుతుందన్నారు. రూ.29వేల విలువైన ఇంజెక్షన్ ఉచితంగా చేయడం జరుగుతుందని చెప్పారు. అవసరమైతే గంటలోపు 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వం వైద్య శాలకు వైద్యులు వచ్చి, పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. వైద్యులు ఫాతి మున్నీషా, జనరల్ సర్జన్ ఇందిర ప్రయదర్శిని, డాక్టర్ శ్రీనివాస్, దంత వైద్యులు మురళీకుమార్, హెడ్ నర్సు పద్మావతి పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యం వద్దు



బాపట్ల: విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని ఆర్జేడీ ఎస్.విజయలక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలోని అక్బర్ పేటలోని బాలసదనంను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. వంటశాలను పరిశీలించి, నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఐసీడీఎస్ కార్యాలయాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ పాఠశాల నిర్వహణపై సమీక్షించారు. ఆర్జేడీతోపాటు ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.ఉమ, సూపరిండెంట్ ఎం.శేఖర్, సంగీత బాలికా సదనం పర్యవేక్షకురాలు ఎస్.సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను ఢీకొట్టిన కారు



కొల్లూరు(వేమూరు): కారు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటన కొల్లూరు మండలంలోని దోనేపూడి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. విజయవాడ నుంచి కొల్లూరు కరకట్ట మీదగా కారు వస్తుండగా దోనేపూడి గ్రామం వద్ద కట్ట దిగుతున్న క్రమంలో పొగమంచు కారణంగా.. కారు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దిమ్మెను ఢీకొట్టింది. కారులో ఉన్నవారికి ఎలాంటి ప్రమాదం జరగ లేదు. దీంతో రూ.10వేల వరకు నష్టం జరిగిందని విద్యుత్ శాఖ ఏఈ సుధాకర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని ఎస్ఐ ఏడుకొండలు తెలిపారు.

విజ్ఞాన్ మహోత్సవ్‌లో 'లైలా' సినిమా యూనిట్ సందడి


సందడి చేస్తున్న సినీ హీరో విశ్వక్‌సేన్

చేబ్రోలు: విద్యార్థులంతా మనసు చెప్పింది మాత్రమే వినాలని హీరో, డైరెక్టర్, స్క్రీన్ రైటర్ విశ్వక్ సేన్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి విజ్ఞాన్ మహోత్సవ్-2కె25లో భాగంగా రెండో రోజు శుక్రవారం 'లైలా' సినిమా యూనిట్ సందడి చేసింది. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా సినీ హీరో విశ్వక్ సేన్ స్టెప్పులతో అలరించారు. అనంతరం మాట్లాడుతూ ఈ నెల 14న సినిమా ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వస్తుందని తెలిపారు. విద్యార్థులంతా ఆదరించి అఖండ విజయాన్ని అందించాలని కోరారు. ఈ చిత్రాన్ని అర్చన సమర్పణలో షైన్ స్క్రీన్స్ ఎంటర్‌టైన్‌మెంట్‌లో సాహు గారపాటి నిర్మించారని, కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించామని తెలిపారు. యాక్షన్ ఎపిసోడ్స్, ఎమోషన్స్, డ్రామా ప్రేక్షకులందరికీ ఆకట్టుకుంటాయన్నారు.తన మనసుకు బాగా దగ్గరైన సినిమానని పేర్కొన్నారు. తన పాత్ర ఇప్పటివరకు చేసిన వాటి కంటే వైవిధ్యభరితమైనదని చెప్పారు. రామ్ నారాయణ్ దర్శకత్వం వహించగా, మ్యూజిక్ డైరెక్టర్‌గా లియోన్ జేమ్స్, సినిమాటోగ్రఫీ రిచర్డ్ ప్రసాద్, ఎడిటర్‌గా సాగర్, రైటర్‌గా వాసుదేవ మూర్తి పనిచేశారని వెల్లడించారు. అనంతరం లైలా సినిమా యూనిట్ విద్యార్థులతో సెల్ఫీలు దిగింది.

బాజీబాబా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



పెదకాకాని: బాజీబాబా దర్గాలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పెదకాకాని హజరత్ సయ్యద్ బాజీషహీద్ అవులియా దర్గాలో జరిగే ప్రార్థనల్లో పాల్గొని మొక్కులు చెల్లించేందుకు జిల్లా నలుమూలల నుండే కాక పలు జిల్లాల నుండి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. బాజీబాబా దర్గా ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. షఫా బావి నీటితో స్నానాలు చేసిన భక్తులు దర్గాలో ప్రదక్షిణలు చేసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. వక్ఫ్‌బోర్డు ఈఓ షేక్ ముక్తార్‌భాషా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు.సాయంత్రం సలామి ప్రార్థనలు జరిగాయి. దర్గాలో అంత్రాలు, తాయత్తులు అధికసంఖ్యలో అమ్మకాలు జరిగాయి. పలువురు భక్తులు తమకు ఆవహించిన చీడపీడలు తొలగిపోవాలని రాత్రికి దర్గాలోనే నిద్రలు చేశారు.